


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ప్రేమ - బంధం

**"అమ్మమ్మా అక్వేరియంకి వెళ్దాం."**

పిల్లలిద్దరూ చెరోవైపు కూర్చుని గారాలు పోయారు.

నాకెందుకో వ్యక్తిగతంగా జూ, అక్వేరియంలాంటి వాటికి వెళ్ళడం ఇష్టం ఉండదు. బహుశా బంధించబడిన ఆ ప్రాణుల్లో నన్ను నేను చూసుకుంటానేమో! అందుకే వాళ్ళతో మృదువుగా చెప్పాను.

"అమ్మతో వెళ్ళిరండి. సాయంత్రం మనం పార్క్‌కి వెళ్దాం."

"ప్లీజ్ అమ్మమ్మా" ఇద్దరూ చెరో చెంపమీద ముద్దుపెట్టి జాలిగా అడిగారు.

"వాళ్ళంత ఇదిగా అడుగుతూంటే వెళ్ళచ్చుగా? ఇంట్లో ఉండి చేసే రాచకార్యాలేమున్నాయ్ తమకి?" మావారు కోపంగా అరిచారు.

"నేను తీసుకెళ్తానన్నాకదా? ఇది మా ఊరే, నాకన్నీ తెలుసు" మా అమ్మాయి పిల్లలకి నచ్చచెప్పబోయింది.

నేను వాళ్ళిద్దర్నీ చెరో చేత్తో దగ్గరకి తీసుకుని చెప్పాను.

"సరే వెళ్దాంలే."

కారు కదలగానే మా అమ్మాయి కోపంగా అడిగింది.

"నో చెప్పే అధికారం కూడా లేదా అమ్మా? నీకిష్టంలేనప్పుడు నాన్నెందుకు బలవంతం చేస్తారు? ఆయనకిష్టం లేని పని చేయమంటే చేస్తారా?"

"వదిలెయ్. చిన్నప్పటినించీ ఆయన తత్త్వం నీకు తెలుసు" చెప్పి పిల్లలతో చెప్పాను.

"నేను లోపలకి రాను. బయట వెయిటింగ్ ఏరియాలో కూర్చుంటా. మీరు అమ్మతో వెళ్ళి చూసిరండి. సరేనా?"

వాళ్ళిద్దరూ తలలుపారు.

"నీకు విసుగ్గా ఉంటుందేమో అమ్మా. గంటపైన పడుతుందేమో?" మా అమ్మాయి సందేహంగా చెప్పింది.

"ఏం పర్లేదు. ఫోన్ ఉందిగా. పెద్దమ్మతో మాట్లాడి చాలా రోజులైంది. కాసేపు కబుర్లు చెప్పుకుంటాం" చెప్పాను.

మా అమ్మాయి నావంక జాలిగా చూసింది.

అక్వేరియం ఆవరణలో కారు దిగి లోపలకి నడిచాం. టిక్కెట్ కౌంటర్ పక్కన కొన్ని సోఫాలు వేసి ఉన్నాయి. నేను గోడకి ఆనించి వేసిన చివరి సోఫాలో కూర్చున్నాను. మా అమ్మాయి టిక్కెట్స్ కొనుక్కొచ్చి నాకు జాగ్రతలు చెప్పి పిల్లలతో లోపలకి వెళ్ళిపోయింది.

నేను కూర్చున్న సోఫాకి అటువైపు ముప్పైల్లో ఉన్న ఓ అమ్మాయి కూర్చుని ఉంది. ఆమె ముందున్న బేబీ కార్ట్‌లో నెలల బాబు పడుకుని ఉన్నాడు. ఆమె చిన్న పాలసీసాకి కర్చీఫ్ చుట్టి వాడికి పాలుపడుతోంది. ఆ అమ్మాయి ముక్కు చివర చిన్న వంపు తిరిగి చిలకముక్కులా ఉంది. ఐనా ముఖ కవళికలు బాగుండడంతో అందగత్తె అనే చెప్పాలి.

నేను బేగ్‌లోంచి మొబైల్ ఫోన్ తీసి, మా అక్కకి ఫోన్ చేశాను. వెంటనే ఎత్తి చెప్పింది.

"రెండు నిమిషాల్లో చేస్తా."

నేను ఫోన్ చేతిలో పట్టుకుని ఆ అమ్మాయి వంక చూసాను. పిల్లవాడి డైపర్ మార్చి, వాడ్ని ఎత్తుకుని, రెండో చేతికి కొంచెం పెద్దగా ఉన్న హేండ్‌బేగ్ తగిలించుకుని బాత్‌రూమ్స్ వైపు వెళ్ళింది. ఇంతలో మా అక్క నించి ఫోన్ రావడంతో నేను సంభాషణలో మునిగిపోయాను.

దాదాపు అరగంట తర్వాత సన్నగా పొడుగ్గా ఉన్న ఒకతను ఐదారేళ్ళ బాబుతో అక్కడకి వచ్చాడు. బేబీ కార్ట్‌ని చూసి నావంక చూసాడు. నేను 'ఒక్క నిమిషం' అని మా అక్కకి చెప్పి అతనివైపు చూసాను.

"ఇక్కడ ఒకమ్మాయి బాబుతో కూర్చుందికదా? ఎక్కడికి వెళ్ళిందో తెలుసా?" అతను అడిగాడు.

"బాత్‌రూమ్స్ వైపు వెళ్ళింది. చాలా సేపైంది." చెప్పాను.

అతను ఆమె నంబర్‌కి అనుకుంటా ఫోన్ చేసాడు, ప్రామ్ లో మోగిందది. అందులోని బేబీ బ్లాంకెట్‌ని పక్కకి తీసి చూస్తే సెల్‌ఫోన్.

అతను ఇంగ్లీష్‌లో ఓ బూతు పదం తిట్టి కొడుకుతో చెప్పాడు.

"నువ్వు కదలకుండా ఇక్కడే కూర్చో నేను వెళ్ళి, మీ అమ్మ ఎక్కడుందో చూసివస్తాను."

వాడు భయంగా తలూపాడు.

నేను మా అక్కకి 'మళ్ళీ మాట్లాడతానని ' చెప్పి ఫోన్ బేగ్‌లో పెట్టేసాను.

ఆ అమ్మాయి ఎక్కడికి వెళ్ళుంటుంది? భర్త మంచివాడిలా లేడు. ఫోన్ మర్చిపోయినందుకు అంత పెద్ద తిట్టు తిట్టాడు. మధ్యలో ఈ పసివాడు నలిగిపోతున్నాడు అనుకున్నాను.

అతను వెళ్ళి పావుగంట దాటింది. పిల్లవాడు ఏడవడానికి సిద్ధమౌతున్నాడు. మా అమ్మాయి వస్తుందేమో, నేను కూడా వెళ్ళిపోతే వీడు ఒక్కడే వుండాలి పాపం. నేను నా ఆలోచనల్లో ఉండగానే మా అమ్మాయి, పిల్లలు వచ్చేసారు.

"అప్పుడే వచ్చారే? అన్నీ వివరంగా చూసారా?" అడిగాను.

"అప్పుడే అన్నావంటే నీకు విసుగుపుట్టలేదు. సరే ఇంకొద్దిసేపు కూర్చుంటావా? వీళ్ళకి బయట ఫోటోలు తీసి, ఏవో రైడ్స్ ఉన్నట్లున్నాయి. ఎక్కించివస్తా" మా అమ్మాయి అడిగింది.

"ఇప్పుడే ఇంటికి వెళ్ళి చేయాల్సిన రాచకార్యాలే లేవన్నారుగా నాన్న. వెళ్ళి వాళ్ళని ఫోటోలు తియ్" మనసులో సంతోషిస్తూ చెప్పాను.

వాళ్ళు వెళ్ళాక నా బేగ్‌లోంచి చాక్లెట్ బార్ తీసి ఆ కుర్రాడికి ఇవ్వబోయాను. వాడు తల అడ్డంగా ఊపాడు.

"ఇప్పుడు ఒక అన్న, అక్క వచ్చి వెళ్ళారు కదా? వాళ్ళ కోసం తెచ్చాను తిను" ఆప్యాయంగా చెప్పాను.

వాడు ఒక క్షణం తటపటాయించి దాన్ని అందుకని నిమిషంలో నమిలేసాడు. ఆ తర్వాత రెండు నిమిషాలకి వాడి నాన్న కోపంగా వచ్చాడు.

"ఎక్కడా లేదు. ఇంటికి వెళ్ళిందేమో పద" చెప్పి ఒక చేత్తో వాడి చెయ్యిపట్టుకుని మరో చేత్తో కార్ట్‌ని తోసుకుంటూ వెళ్ళిపోయాడు.

నాకు అదో థ్రిల్లింగ్ కథలా అనిపించింది. ఆ అమ్మాయి అలా భర్తని, పెద్ద కొడుకుని వదిలి ఎక్కడికి, ఎందుకు వెళ్ళిపోయింది? తెలిస్తే బాగుండు అనిపించింది.

రెండు సంవత్సరాల తర్వాత మేము మా అమ్మాయి దగ్గరకి హ్యూస్టన్ వెళ్ళాం. వెళ్ళిన వారానికి మా అమ్మాయి చెప్పింది.

"అమ్మా ఈ వీకెండ్‌కి నా ఫ్రెండ్ ప్రియ ఇంట్లో పార్టీ ఉంది. తెలుగువాళ్ళే. మిమ్మల్ని కూడా తీసుకురమ్మని చెప్పింది. అక్కడ మీకు ఎవరూ తెలీదు అనుకుంటే మీ ఇష్టం. లేదా మాతో రండి. తను సంతోషిస్తుంది."

"నేను రాను కానీ మీ అమ్మని తీసుకెళ్ళు."

నామీద సర్వాధికారాలు ఉన్న నా భర్తగారు చెప్పారు.

"సందర్భం ఏమిటి?" అయిష్టంగా అడిగాను.

" వాళ్ళ పెళ్ళయి పదేళ్ళయిందిట. ఏనివర్సరీ."

ఆరోజు వాళ్ళింట్లో నేను ఆ చిలకముక్కు అమ్మాయిని మరోసారి చూసాను. 'మొదట ఎక్కడో చూసినట్లుంది' అనుకున్నాను. తర్వాత వెంటనే గుర్తొచ్చింది ఇన్నేళ్ళు వచ్చినా భర్తంటే భయపడే నాకు, భర్తని పరుగులు పెట్టించిన ఆ అమ్మాయి అంటే ఒక విధమైన ఆరాధన అనుకుంటా. మర్చిపోలేక పోయాను. పిల్లవాడు మూడేళ్ళవాడయ్యాడు. నేను చనువుగా ఆమె దగ్గరకి వెళ్ళి అడిగాను.

"బాగున్నావా? మీ ఆయన ఎలా ఉన్నాడు? పెద్ద బాబు ఎక్కడా? ఆడుకుంటున్నాడా?"

ఆమె పులినో, భూతాన్నో చూసినట్లుగా నావంక చూసి అడిగింది.

"మీరెవరు?"

నా పొరపాటుని గుర్తించిన నేను దాన్ని కప్పిపుచ్చుకుంటూ చెప్పాను.

"నన్ను మర్చిపోయి ఉంటావు. ఇండియాలో పరిచయం. రెండేళ్ళు దాటింది కదా?"

ఆమె విభ్రాంతిగా చూస్తూ చెప్పింది.

"గుర్తు రావడంలేదండి."

"అమ్మా. ఒకసారి వస్తావా?" మా అమ్మాయి దూరం నుంచి పిలిచింది.

నేను పిల్లవాడి బుగ్గలు పుణికి చెప్పాను.

"వీళ్ళన్నయ్యవి పెద్దకళ్ళు. వీడివి మరీ చైనీస్ కళ్ళు"

"నీకు ఆమె తెలుసా అమ్మా మాట్లాడుతున్నావు?" మా అమ్మాయి ఆసక్తిగా అడిగింది.

"కొంచెం చిరు పరిచయం. ప్రియాకి ఫ్రెండా?"

"అవుననుకుంటా నాకు తెలీదు" చెప్పింది.

భోజనాలయ్యాక ఆ అమ్మాయి నిద్రపోతున్న కొడుకుని భుజాన పడుకోపెట్టుకుని తెల్లగా, లావుగా ఉన్న అబ్బాయి పక్కనే నడిచి వెళ్తుంటే ఆశ్చర్యపోయాను.

ఈ అమ్మాయి ఎప్పుడూ ఏదో సస్పెన్స్‌లో పెడుతూనే ఉంది నన్ను.

మర్నాడు మా అమ్మాయి ఆఫీస్‌నించి ఫోన్ చేసింది.

"అమ్మా, ప్రియా ఎందుకో మనింటికి వస్తానని ఫోన్ చేసింది. నాకన్నా ముందు వస్తే కాఫీ ఇచ్చి, కబుర్లు చెప్తూండు."

ప్రియ ఆకస్మిక రాకకి ఆ చిలక ముక్కు అమ్మాయే కారణం అని నాకు బలంగా అనిపించింది.

అనుకున్నట్లుగానే ప్రియ మా అమ్మాయికంటే ముందే వచ్చేసింది.

"కాఫీలు మర్యాదలు ఏం వద్దు ఆంటీ. మీతో మాట్లాడాలి" సూటిగా చెప్పింది.

"చెప్పమ్మ" డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని అడిగాను. తను నా పక్క కుర్చీలో కూర్చుని చెప్పింది.

"మీరు కన్యని పలకరించారట. తనకి మీరెవరో తెలీదుట. రాత్రంతా నిద్రలేదు. కొంచెం వెళ్ళి కనుక్కుంటావా ఆవిడ ఎవరో అని పొద్దున ఫోన్ చేసింది. మీకు తను ఎలా తెలుసు?"

"ఆ అమ్మాయి పేరు కన్య అన్నమాట. నేను పలకరిస్తే నిద్రలేకపోవడం ఎందుకు?" విస్మయంగా అడిగాను.

"శ్రీకన్య. తన పేరు కూడా తెలీదా మీకు?" ఆశ్చర్యంగా అడిగింది.

నేను రెండేళ్ళ క్రితం అక్వేరియంలో జరిగిన సంఘటన వివరించి చెప్పాను.

"ఆ తర్వాత ఆ అమ్మాయి ఏమైందా అని ఆరాటంగా ఉండేది. అనుకోకుండా మీ ఇంట్లో చూసేసరికి అప్రయతంగానే పలకరించా. సారీ. అది తప్పనుకోలేదు" క్షమాపణగా చెప్పాను.

"తను మా వదిన. అక్వేరియంలో కనపడ్డ అతను కాదు. నిన్న మా ఇంట్లో మీరు చూసినవాడు మా అన్నయ్య."

నేను నిర్ఘాంతపోయాను.

"మరి అతను?"

"తన మొదటి భర్త."

నాకేం మాట్లాడాలో తెలీలేదు. నా పరిస్థితి అర్థం చేసుకున్న ప్రియ చెప్పింది.

"మీకంతా వివరంగా చెప్తాను ఆంటీ. మా అన్నయ్య ప్రబోధ్, కన్య చిన్నప్పటినించి, ఐ మీన్ ఇంటర్మీడియట్‌నించి ప్రేమించుకున్నారు. ప్రభూ మాస్టర్స్ కోసం ఇక్కడికి వచ్చినప్పుడు వాళ్ళ పేరెంట్స్ తన పెళ్ళి వేరొకబ్బాయితో చేసేసారు. వీడు ఇండియా వెళ్ళి, ఆ విషయం తెలుసుకుని మొదట బాధపడ్డాడు.

తర్వాత మూర్ఖంగా తనతో వచ్చెయ్యమన్నాడు. కన్య ఆలోచిస్తానంది. మా పేరెంట్స్ ఒప్పుకోలేదు. పెళ్ళయిన అమ్మాయిని ఎలా చేసుకుంటావు అని తిట్టారు. ఈ లోగా వీడి సెలవులైపోయి వెనక్కి వచ్చేసాడు. వీళ్ళ మధ్య కరస్పాండెన్స్ కొనసాగుతూనే ఉంది. ఆమెకి ఇద్దరు పిల్లలు పుట్టారు. మీకు తను కనపడిన ఆ అక్వేరియం ఇన్సిడెంట్‌కి పదిరోజుల ముందు కన్యకి వీసా వచ్చింది."

"వాళ్ళాయన ఎలా ఒప్పుకున్నాడు?"

అతనికి ఈ ప్రేమ ఈ విషయాలు ఏమీ తెలీవు "ఉదయం ఎనిమిదికి ఆఫీస్‌కి వెళ్ళి, సాయంత్రం ఆరుకి ఇంటికి వస్తాడు. ఈలోగా ఎన్నో పనులు చేయచ్చు ఆంటీ. అన్నీ రహస్యంగానే చేసింది. వీడు టిక్కెట్ కొన్నాడు. ఆరోజు అనుకోకుండా సెలవు వచ్చి అతను అక్వేరియంకి వెళ్దామన్నాడు. తప్పక వెళ్ళి, మధ్యలో తలనొప్పి అని బయటకు వచ్చేసింది. కొడుకుతో సరాసరి ఏర్‌పోర్ట్‌కి వెళ్ళి విమానం ఎక్కింది. ముందుగా తన వస్తువులతో సూట్‌కేస్‌లని నింపి

ఇంకో ఫ్రెండ్ ఇంట్లో పెట్టింది. ఆమె ఏర్‌పోర్ట్‌కి వాటిని తీసుకెళ్ళి ఇచ్చింది. పాస్‌పోర్ట్ డాలర్స్ కన్య హేండ్ బేగ్‌లోనే ఉన్నాయి. బహుశా ప్రభు యు.ఎస్.లో కాక ఇండియాలో ఉంటే ఒప్పుకునేది కాదేమో."

"ఎంత క్రిమినల్ బ్రెయిన్?" నేను ఆశ్చర్యపోయాను.

"అవును. ఇక్కడికి వచ్చాక, ఇండియాలోని ఆ ఫ్రెండ్ కన్య భర్తకి సంతకం పెట్టిన విడాకుల కాగితాలిచ్చింది. మారు మాట్లాడకుండా సంతకాలు పెట్టేసాడుట. తర్వాత మావాడు పెళ్ళిచేసుకుని వీసా స్టేటస్ మార్చాడు."

"అయ్యో! మరి పెద్ద కొడుకు?" ఆక్రోశంగా అడిగాను.

"ఫాదర్‌తోనే ఉన్నాడేమో మరి. తెలీదు కన్య పేరెంట్స్ ఆమెతో సంబంధాలు తెంచేసుకున్నారు."

నా మనసు విలవిల్లాడింది. పెద్దకళ్ళతో అమాయకపు చూపులతో వాడు తండ్రికోసం ఎదురు చూడడం గుర్తొచ్చింది చాక్లెట్ ఇస్తే, ఆకలిగా ఉన్నా తల అడ్డంగా తిప్పిన వాడి అభిమానం గుర్తొచ్చింది.

"తండ్రి ఇంకో పెళ్ళి చేసుకుంటే ఆ అమ్మాయి ఎలా చూస్తుందో వాడిని."

"తెలిదు. కన్యకూడా వాడి గురించి బాధపడదు."

నన్ను అస్తమానం సతాయించే నా భర్తకన్నా భర్తని కొడుకుని అంత మోసం చేసిన కన్య పరమ దుర్మార్గురాలు అనిపించింది.

"ఏం ప్రేమలు? రాక్షస ప్రేమలు. కన్నబిడ్డకంటే ప్రేమ ఎక్కువైందా? నేను పొరపడ్డానని, ఎవరో అనుకుని ఆ అమ్మాయిని పలకరించానని చెప్పు. నాకు ఇంకోసారి ఆమె మొహం చూడాలని లేదు. మీ వదినని అంటున్నానని ఏమీ అనుకోకు. అది మనిషికాదు. మృగం కూడా కాదు. రాక్షసి" ప్రియతో కటువుగా చెప్పాను.

"నిజమే ఆంటీ తను ఎప్పుడూ వాడిని తలచుకోలేదు. మృగానికి పిల్లలంటే ప్రేమ ఉంటుంది. తనకి లేదు. మా అన్నయ్యని వదులుకోలేక ఆమెని భర్తిస్తున్నాం. మాకేం తనమీద అభిమానంలేదు" ప్రియ చెప్పింది.

"మీ అన్నయ్య కొడుకుతో సహా ఆమెని స్వీకరించాడు కదా? మరి పెద్దకొడుకుని ఎందుకు తెచ్చుకోలేదు? అక్వేరియం మూలంగా వాడిని తీసుకెళ్ళడం మిస్సయినా మళ్ళీ వెళ్ళి తెచ్చుకోవచ్చుగా?"

"మొదటినించీ తను చిన్నకొడుకుతోనే వస్తానన్నట్లుంది. పెద్దవాడి గురించి ఆలోచించలేదు. వీసాకి వెళ్ళినప్పుడు మాత్రం వాడిని చూపించి 'తండ్రి దగ్గర వదిలి వెళ్తున్నా. వాడి కోసమైనా తిరిగి ఇండియా వస్తా' అని చెప్పిందిట."

"ఛీ"

ఇప్పుడు నాకా చిలక ముక్కు అమ్మాయి రాబందులా అనిపిస్తోంది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*